క్లుప్తంగా

సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'సైబర్ క్రైమ్స్ అవేర్‌నెస్' అనే అంశంపై సైబరాబాద్‌లోని ఎస్‌సీఎస్‌సీ సైబర్ సెక్యూరిటీ సీనియర్ మేనేజర్, సైబర్ రక్షక్ ఆపరేషన్స్ హెడ్ భాను యాచరేని ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

గ్యార్వీ షరీఫ్ వేడుకలు



శేరిలింగంపల్లి: గ్యార్వీ షరీఫ్ వేడుకలను శుక్రవారం ఓల్డ్ లింగంపల్లిలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని ముస్లిం యువకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేశంగౌడ్, రాజుయాదవ్, ఖాజాపాష, అజీమ్, రాంచందర్, పద్మారావు, అస్లాం, గఫార్, రవియాదవ్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక పరికరాలతో వైద్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌లో ఎథోస్-ఎ1 ఆధారిత అడాప్టివ్ ఎక్స్‌టర్నల్ రేడియోథెరపీని 88 ఏళ్ళ వ్యక్తికి విజయవంతంగా అందించారు. హైరిస్క్ ప్రోస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 88 ఏళ్ళ బత్రా (పేరు మార్చారు)కు అధునాతన ఎక్స్‌టర్నల్ రేడియోథెరపీని డాక్టర్ హర్జోత్ కౌర్ బజ్వా నాయకత్వంలో విజయవంతంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్జోత్ మాట్లాడుతూ మూడు నెలలుగా మూత్ర విసర్జన చేయడానికి ఇబ్బందులు పడుతుండడంతో వైద్య పరీక్షల్లో హైరిస్క్ ప్రోస్టేట్ క్యాన్సర్ (అడ్వాన్స్ స్టేజ్)తో బాధపడుతున్నట్టు గుర్తించినట్లు వివరించారు. ప్రోస్టేట్ గ్రంధిలో కణాలు నియంత్రణ లేకుండా పెరగడం వలన ప్రోస్టేట్ క్యాన్సర్ వస్తుందన్నారు. ఏఓఐ హైదరాబాద్ ప్రాంతీయ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డా.ప్రభాకర్ మాట్లాడుతూ ఆంకాలజీ రంగంలో అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ అత్యాధునిక వైద్యం అందిస్తుందన్నారు.

ఘనంగా దుర్గామాత ఊరేగింపు



మియాపూర్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మియాపూర్ పరిధిలోని న్యూ కాలనీలో శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఊరేగింపును గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరై పూజలు నిర్వహించారు.

10 మందికి జరిమానా..

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 10 మందికి జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..బుధ, గురువారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 10 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గచ్చిబౌలి: వాకింగ్ వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ భానుప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరీనగర్‌లో ఎస్ఎల్ఎన్ఎస్ కొండపల్లి ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉండే కలవెండి వెంకట అనంత పద్మనాభ శాస్త్రి(67) గురువారం ఉదయం 8.15 గంటలకు వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అతనికి వరుసకు అల్లుడైన శ్రీకాంత్ వెతుకుతుండగా రోడ్డుపైన శాస్త్రి స్పృహతప్పి పడిపోతూ విద్యుత్ స్తంభాన్ని పట్టుకొని కిందపడటం చూశాడు. దగ్గరి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉండటంతో వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే అతను మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. విద్యుత్ స్తంభాన్ని పట్టుకున్నప్పుడు విద్యుదాఘాతానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భద్రత..పకడ్బందీ

- మాదాపూర్ పరిధిలో 11 వేల సీసీ కెమెరాలు
- ఎన్నికల నేపథ్యంలో పక్కాగా తనిఖీలు



మాదాపూర్ పోలీస్‌స్టేషన్

మాదాపూర్: మాదాపూర్ ఐటీ, వ్యాపార సముదాయాల ప్రాంతం కావడంతో విస్తృత తనిఖీలు, కార్డన్ సెర్చ్ నిర్వహిస్తూ శాంతిభద్రతలను కాపాడుతున్నారు. కాకతీయ హిల్స్ కమాన్, మెటల్ చార్మినార్ , సైబర్ టవర్స్, ఖానామెట్ తదితర ప్రధాన కూడలి ప్రాంతాలలో ప్రతి రోజు దాదాపు 250 వాహనాల తనిఖీలు నిర్వహించి దొంగతనాలను అరికడుతున్న నేపథ్యంలో మాదాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.తిరుపతితో ఇంటర్వ్యూ...

మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎంతమంది సిబ్బంది, ఎన్ని సెక్టార్‌లు ఉన్నాయి.

◆ మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మొత్తం 120 మంది సిబ్బంది ఉన్నారు. ఇందులో ఇద్దరు సీఐలు, 10 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు 5గురు, హెడ్‌కానిస్టేబుల్స్ 11 మంది. మిగిలిన కానిస్టేబుల్స్ 94 మంది ఉన్నారు.

పెట్రోలింగ్ ఏఏ ప్రాంతాలలో ఎక్కువగా నిర్వహిస్తున్నారు.

◆ రోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తాం. ఎక్కువగా ప్రధాన కూడళ్లు, అనుమానాస్పదంగా ఉన్న ప్రాంతాల్లో నిర్వహిస్తాం. కేబుల్‌బ్రిడ్జిపై ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రతి 10నిమిషాలకు వచ్చే వారిని గమనిస్తూ పెట్రోలింగ్ పోలీసులు తిరుగుతున్నారు. గతంలో పెట్రోలింగ్ పోలీసుల వల్లనే కొంత మంది నిందితులను పట్టుకున్నాం. ఆత్మహత్య చేసుకునే వారిని కాపాడాం. ఏదైనా సమస్య వస్తే 100కి డయల్ చేయాలి.



మాదాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి

ఎన్నికల వేళ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

◆ ప్రతి కాలనీ, బస్తీలలో ఓటు ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటే మీ ఆయుధం అని చెబుతున్నాం.

ఎలక్షన్ల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలు ?

◆ భద్రతను మరింత పటిష్టం చేశాం. ప్రధాన కూడలిలో మరిన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాం. పట్టుబడిన నగదు, బంగారాన్ని రిటర్నింగ్ ఆఫీసర్‌కి అప్పచెబుతున్నాం. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికి 55 మందిని బైండోవర్ చేశాం.

అమరవీరుల త్యాగం ఎనలేనిది



బైక్‌ర్యాలీలో పాల్గొన్న కొండాపూర్ 8వ బెటాలియన్ పోలీసులు

గచ్చిబౌలి: ప్రజా రక్షణలో పోలీసులు అలుపెరగని సేవలందిస్తూ అసువులుబాశారని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్ అదనపు కమాండెంట్ కె.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ బెటాలియన్‌లో పోలీసుఅమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను కొనియాడారు.కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు వి.నర్సింహస్వామి, రెహమాన్, సత్యనారాయణ, నారాయణ దాసు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు దుబారా అనడం తగదు

- ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: రైతు బంధు దుబారా అని పీసీసీ మాజీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. రైతుబంధుపై కాంగ్రెస్ పార్టీ అక్కసు వెళ్లగక్కుతూ రైతు వ్యతిరేక పార్టీగా మిగిలిందన్నారు. రైతులకు 3 గంటల కరెంట్ చాలు అని రేవంత్ రెడ్డి , రైతు బంధు దుబారా ఖర్చు అని ఉత్తమ్ అనడం కాంగ్రెస్ అనైతికతకు నిదర్శనమన్నారు. రైతు బంధు రద్దు చేస్తామని బీజేపీ నాయకులు ఈటెల పేర్కొనడం సమంజసం కాదని, ఈలాంటి ప్రతిపక్షాలను నమ్మి ఓటేస్తే రైతులకు కష్టాలు తప్పవన్నారు. ప్రతి పక్షాల కుటిల ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు.

ఫోన్ చోరీ.. రూ.2 లక్షల నగదు మాయం

- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

పటాన్‌చెరు టౌన్: మార్కెట్‌లో ఫోన్ చోరీకి గురైన ఘటనలో బాధితుడి బ్యాంక్ ఖాతా నుండి రూ.2 లక్షల 47 వేల నగదు మాయమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని సీతారాంపూర్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఈ నెల 22వ తేదీన పటాన్‌చెరు మార్కెట్ కి వెళ్లాడు.అయితే మార్కెట్‌లో ఫోన్ చోరీకి గురైంది.దీంతో బాధితుడు ఫోన్ కోసం వెతికి, కొత్త సిమ్ తీసుకున్నాడు. సిమ్ యాక్టివేట్ కాగానే బాధితుడి బ్యాంక్ ఖాతా నుండి పలు దఫాలుగా రూ.2 లక్షల 47 వేల నగదు కట్ అయినట్టు మెసేజ్ లు వచ్చాయి.దీంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, శుక్రవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సబ్బండ వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం...

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తూ అన్ని వర్గాల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి పటాన్‌చెరు నియోజకవర్గ పద్మశాలి సంఘం ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. శుక్రవారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన పద్మశాలి సంఘం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు.అనంతరం ఎమ్మెల్యే ను కలిసి తమ నిర్ణయాన్ని వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. 60 ఏళ్లలో సాధించని ప్రగతిని దశాబ్ది కాలంలో చేసి చూపించిన సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని మరింత ముందుకు కొనసాగించాలంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఘన విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో వారి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, సీనియర్ నాయకులు మల్లేష్, పద్మశాలి సంఘం ప్రతినిధులు వేముల రమేష్, భాస్కర్, నర్సింహులు, సోమదాసు, వీర నారాయణ,చిరంజీవి, నగేష్, విఠల్ రాజు,నాగభూషణం,వాసు, గుర్రం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంపోస్ట్ ఎరువుతో నేల సారవంతం



వర్క్ షాపులో పాల్గొన్న వాణి ప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు

ఈపీటీఆర్ఐ డీజీ వాణి ప్రసాద్

గచ్చిబౌలి: వ్యర్థాల నుంచి ఉత్పత్తి చేయబడిన కంపోస్టును ఎరువుగా వాడితే నేల సారవంతమవుతుందని ఈపీటీఆర్ఐ డైరెక్టర్ వాణిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో 'వేస్ట్ టు వెల్త్' ట్రాన్స్‌ఫార్మింగ్ రిసోర్స్ ఫర్ సాయిల్ ఫెర్టిలిటీ ఎనౌన్స్‌మెంట్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకంతో పంటలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కంపోస్ట్ వాడకంపై రైతులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్ షాపులో ప్రిన్సిపల్ సెక్రెటరీ (పీఆర్ అండ్ ఆర్‌డీ) సందీప్ కుమార్ సుల్తానియా, డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ హన్మంతరావు, రిటైర్డ్ ఐఏఎస్ విజయ్‌కుమార్, పీజేటీఎస్ఏయు ప్రిన్సిపల్ సైంటిస్ట్ సుకృత్ కుమార్, విశ్వ ఆగ్రోటెక్ సీఈఓ సుభాష్ బైరా, నాబార్డ్ జీఎం పీ.టీ.ఉష తదితరులు పాల్గొన్నారు.

చిత్ర ప్రదర్శన



మాదాపూర్: చిత్రకళాకారుడు వెంకట్‌రాములు జోగు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను సందర్శకులు తిలకించారు. కళాకారుడు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. ఈప్రదర్శన ఈనెల 31వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రదర్శనలో 30 చిత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాకారులు చిప్పా సుధాకర్, దేవులపల్లి హనుమంతరావు, శంకర్ మదిలేటి తదితరులు పాల్గొన్నారు.

గోపీనగర్‌లో గడపగడపకూ బీజేపీ




కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: ప్రస్తుత ఎన్నికలలో కారు గుర్తుకు బైబై చెప్పాలని, చేయి గుర్తుకు నై నై చెప్పాలని, కమలం పువ్వు గుర్తుకు జై కొట్టాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ ఓటర్లను కోరారు. 107వ రోజు గడపగడపకూ బీజేపీ రవన్న ప్రజా యాత్ర కార్యక్రమాన్ని గోపీనగర్, బాపూనగర్, ఆదర్శనగర్‌లో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీకి ఈసారి పట్టం కట్టడానికి ప్రజలంతా రెడీగా ఉన్నారని, ఎక్కడ చూసినా ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూస్తుంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలనే లక్ష్యంతో పనిచేసే బీజేపీకి ఈసారి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నవితారెడ్డి, ఎల్లేష్, అనీల్‌కుమార్‌యాదవ్, గుణశేఖర్, చంద్రమౌళి, శంకర్, రమేష్, నర్సింహ్మా, గణేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపించండి

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని గెలిపించాలని ఆరికెపూడి శ్యామలాదేవి అన్నారు. శుక్రవారం చందానగర్‌లోని కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్, వివిధ కాలనీలలో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డితో కలిసి ఆమె బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికి తిరుగుతూ వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మహిళల పక్షపాతి అని... మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: బీఆర్ఎస్ పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పిలుపునిచ్చారు. ఖాజాగూడలో బీఆర్ఎస్ గచ్చిబౌలి డివిజన్ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వంద మంది ఓటర్లకు ఒక నాయకుడు, కార్యకర్త ఆధ్వర్యంలో పనిచేస్తూ వారంతా పార్టీకి ఓటు వేసేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. బూత్, గ్రామస్థాయిలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ,మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాంధీ నాయకత్వంలో గచ్చిబౌలిలో చేసిన అభివృద్ధి ,సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాజునాయక్, చెన్నంరాజు, గణేష్ ముదిరాజ్, శ్రీను పటేల్, విజయభాస్కర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, సతీష్‌ముదిరాజ్, అంజమ్మ, రాజుముదిరాజ్ ,బాలమణి, మాధవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెలంగాణ వ్యతిరేక పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.శుక్రవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో మూడోసారి కేసీఆర్ ప్రభుత్వం రావడం ఖాయమని తెలిపారు. ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రతి గ్రామస్థాయి కార్యకర్త 30 రోజులపాటు సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు.నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో వారి సంక్షేమానికి కృషి చేసినట్లు తెలిపారు. మరోసారి ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రతిపక్ష పార్టీల నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, తెల్లాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్ స్థానిక సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్

పేరు	: వి.జగదీశ్వర్ గౌడ్
తల్లిదండ్రులు	: వి.హరిశంకర్ పటేల్, భాగ్యమ్మ
పుట్టిన తేదీ	: 24-06-1974
స్వస్థలం	: నల్లగండ్ల, శేరిలింగంపల్లి
భార్య	: పూజితగౌడ్ (కార్పొరేటర్)
సంతానం	: హారిక, వైభవ్‌కృష్ణ
విద్యార్హత	: బీకాం, ఎంబీఏ, ఎల్ఎల్‌బీ



రాజకీయ నేపథ్యం : 1996లో కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. 2002లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీగా, 2007లో ఎల్‌బీనగర్ అబ్జర్వర్‌గా పని చేశారు.2009లో జీహెచ్ఎంసీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరుపున హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. టీఆర్ఎస్ చేరి 2016లో రెండోసారి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. 2020లో మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల ఆయనను జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపిక చేశారు. ఆయన భార్య పూజిత గౌడ్ హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు. భార్యాభర్తలిద్దరు బీఆర్ఎస్‌ను వీడి ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. - గచ్చిబౌలి

బస్తీల్లో బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాలు



ఆత్మీయ సమావేశంలో ముస్లింలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని సాయికాలనీ, ఆదిత్యనగర్, ఇజ్జత్‌నగర్‌లలో మహిళలు, ముస్లింలతో శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ, కాలనీవాసులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా ఆరికెపూడి గాంధీని గెలిపించుకుంటామన్నారు. ప్రజలందరికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నానన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు లేకుండా ప్రతి డివిజన్‌ను అభివృద్ధి చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మాట్లాడుతూ తనపై చూపిన అభిమానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో డివిజన్ల అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ వివిధ కాలనీల వాసులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తాం

- కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్
- నల్లగండ్లలో సందడి వాతావరణం.. కార్యకర్తల్లో నూతనోత్తేజం



జగదీశ్వర్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, అభిమానులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని కాంగ్రెస్ అభ్యర్థి వి జగదీశ్వర్‌గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ రెండవ జాబితాలో శేరిలింగంపల్లి టికెట్‌ను జగదీశ్వర్ గౌడ్‌కు కేటాయించడంతో నల్లగండ్లలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం రాత్రి సందడి నెలకొంది. ఈ సందర్భంగా కార్యకర్తలు స్వీట్లు పంచుతూ, బాణసంచా పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఆయనను పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శేరిలింగంపల్లిలో మళ్ళీ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి పార్టీ టికెట్ కేటాయించడం సంతోషంగా ఉందని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేసి పార్టీని గెలిపిస్తామన్నారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు కూడగట్టడానికి యువత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఆయన సూచించారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



దత్తసాయి కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

మియాపూర్ : ప్రధాన రోడ్లపై మురుగునీరు ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మియాపూర్‌లోని దత్తసాయి కాలనీలో మ్యాన్‌హోళ్ల నుండి మురుగునీరు పొంగి పారుతోంది. దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై ఫిర్యాదు చేసినప్పుడు సంబంధిత సిబ్బంది తూ.తూ మంత్రంగా మరమ్మత్తులు చేసి వెళ్తున్నారు. మరలా రెండురోజులకే సమస్య వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు,అధికారులు స్పందించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమంలో నీరు, నియామకాలు ప్రధాన అంశాలు

విశ్రాంత ప్రొఫెసర్ జి.హరగోపాల్

రాయదుర్గం: తెలంగాణ ఉద్యమంలో అనేక అంశాలున్నా నీరు.. నియామకాలు ప్రధాన అంశాలుగా ముందుకొచ్చాయని విశ్రాంత ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన 'తెలంగాణ రాష్ట్రంలో సామాజిక-రాజకీయ గతి' అనే అంశంపై రెండు రోజుల సదస్సులో ఆయన కీలక ఉపన్యాసం చేశారు. తెలంగాణ ఉద్యమంలోని ముఖ్య ఘట్టాలను ఆయన వివరించారు. హరితవిప్లవం, ఎమర్జెన్సీ, నీటి వనరుల చుట్టూ ఉన్న వివాదాలు వంటి కీలక సమస్యలు, ప్రక్రియలపై మాట్లాడారు. ప్రొఫెసర్ ఎస్.సుకుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంతో ముడిపడి ఉన్న సాంప్రదాయాలు, ఆదర్శాల గురించి వివరించారు. కార్యక్రమంలో 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ప్రొఫెసర్ షరీదా సిద్దిఖీ, ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్, ప్రొఫెసర్ ఏ నాగేశ్వరరావు, డాక్టర్ షబానా ఫర్వీన్, ముజఫర్‌హుస్సేన్ ప్రసంగించారు.